

నల్లగొండ

సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

22 గురువారం అక్టోబర్ 2026 పేజీలు: 3


# బంగారం కోసం వృద్ధురాలి హత్య

**సత్య నిష్ఠ ఆర్ సి హుజుర్నగర్:** వృద్ధురాలు హత్యకు గురైన ఘటన హుజూర్‌నగర్ పట్టణంలోని సుందరయ్య నగర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని 6వ వార్డు పరిధిలో గల సుందరయ్య నగర్ కాలనీకి చెందిన మామిడి రాములమ్మ (74) అనే వృద్ధురాలు మంగళవారం రాత్రి దారుణ హత్యకు గురైనట్లు ఎస్ఐ చలికంటి నరేశ్ తెలిపారు. కాగా ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాల కోసం హత్య చేసినట్లు అనుమానిస్తున్నామని, ఈ విషయంపై కాలనీవాసుల నుండి వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించినట్లు చెప్పారు. ఈ హత్య ఘటనపై రాములమ్మ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

# దేవరకొండలో మైనారిటీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతి



**దేవరకొండ,అక్టోబర్ 19(సత్య నిష్ఠ):** దేవరకొండ నియోజకవర్గంలోని ముస్లిం, క్రైస్తవ మైనారిటీల సామాజిక, సాంస్కృతిక అవసరాలను తీర్చేందుకు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఆదివారం మైనా రిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారు ద్దీన్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు.

**నాలుగు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు**

దేవరకొండ నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనారిటీల కోసం దేవరకొండ, చింతపల్లి, డిండి ప్రాంతాల్లో ఒక్కో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అదేవిధంగా దేవరకొండలో క్రైస్తవ మైనారిటీల కోసం ప్రత్యేక కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.75 లక్షలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ నాలుగు నిర్మాణాలకు కలిపి మొత్తం రూ.2.25 కోట్ల నిధులు అవసరమవుతాయని వివరించారు. మైనారిటీ వర్గాల ప్రజలు సమావేశాలు నిర్వహించుకోవడానికి, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడానికి, విద్యా సంబంధిత కార్యక్రమాలు నిర్వహించడానికి కమ్యూనిటీ హాళ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో తగిన వసతులు కల్పించడం ద్వారా మైనారిటీ వర్గాల అభివృద్ధికి మరింత తోడ్పాటు అందించవచ్చని వివరించారు. దేవర కొండ నియోజకవర్గంలోని మైనారిటీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రతిపాదిత కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను మైనారిటీ సంక్షేమ శాఖ ద్వారా త్వరితగతిన మంజూరు చేసి, నిర్మాణ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను ఎమ్మెల్యే బాలునాయక్ కోరారు.

# సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే బాలు నాయక్ శుభాకాంక్షలు



**కొండారెడ్డిపల్లిలో సీఎం ని కలిసిన ఎమ్మెల్యే**

**దేవరకొండ-అక్టోబర్ 21(సత్యనిష్ఠ):** రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు దసరా పండుగ సందర్భంగా తన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లికి వచ్చిన నేపథ్యంలో దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలునాయక్ గారు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి పర్వదినం రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి, శ్రేయస్సు నింపాలని ఎమ్మెల్యే బాలునాయక్ ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని, ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాలని ఆయన కోరుకున్నారు. దసరా పండుగ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు.

# ఎండుతున్న పంటలకు సాగునీరు ఎక్కడ ఉత్తమ్?

- కొత్త లిఫ్టులు రైతుల ప్రయోజనం కోసమా? మీ కమిషన్ల కోసమా ఉత్తమ్?
- ఎల్34, ఎల్35 ఎల్36 లిఫ్ట్‌ల ద్వారా వెంటనే సాగునీరు విడుదల చేయాలి - ఎండుతున్న పంటలను కాపాడాలి
- చెరువులు నిండేదాకా సాగర్ నీరు ఆగొద్దు... రైతులకు అన్యాయం జరగొద్దు!
- నడిగూడెం ఇరిగేషన్ కార్యాలయం ముందు బీఆర్ఎస్ నేతల ధర్నా & నిరసన
- ఉప కార్య నిర్వహణ ఇంజనీర్ కు వినతిపత్రం అందచేత
- మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్



**కోదాడ - అక్టోబర్ 21 (సత్యనిష్ఠ)** నడిగూడెం మండల రైతాంగానికి తక్షణమే సాగునీరు అందించి, ఎండిపోతున్న పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్ నడిగూడెం మండల కేంద్రంలోని నీటిపారుదల శాఖ ఉప కార్యనిర్వాహక ఇరిగేషన్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. కోదాడ మాజీ శాసనసభ్యులు బొల్లం మల్లయ్య యాదవ్, నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాగునీటి సమస్యను పరిష్కరించాలని నినాదాలు చేసి అధికారులకు వినతి పత్రం అందించారు. ఎల్34, ఎల్35, ఎల్36 లిఫ్ట్‌ల ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి, నడిగూడెం మండలంలోని ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని వారు డిమాండ్ చేశారు. అప్పులు చేసి రైతులు పంటలు పండిస్తున్న సమయంలో సాగునీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొనడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవు తున్నారని, అధికారులు ఇకనైనా స్పందించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రస్తుత ప్రభుత్వం రైతుల సాగునీటి సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. పంటలు సాగు చేసిన రైతులకు సకాలంలో నీరు విడుదల చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, అందుబాటులో ఉన్న లిఫ్ట్‌లు, ప్రాజెక్టులు, కాలువల ద్వారా నీటిని విడుదల చేసి పంటలను కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నడిగూడెం ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తుంటే, నీటిని పక్కనే ఉన్న ఖమ్మం జిల్లా పాలేరు ప్రాంతానికి తరలిస్తు న్నారని ఆయన ఆరోపించారు. స్థానిక రైతుల అవసరాలను పరిగణన లోకి తీసుకో కుండా నీటి పంపిణీ చేపట్టడం వల్ల రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. "మత్తు నిద్రలో ఉన్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికైనా మేల్కొని నడిగూడెం రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించాలి" అని బొల్లం మల్లయ్య యాదవ్ డిమాండ్ చేశారు. చెరువులు నిండి పంటలకు నీరు అందుతుందని ఆశించిన రైతులకు నిరాశ ఎదురవుతోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎల్34, ఎల్35 ఎల్36 తదితర లిఫ్ట్‌ల ద్వారా సమృద్ధిగా నీటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని ప్రకటనలు చేయడం కంటే, క్షేత్ర స్థాయిలో రైతులకు ఉపయోగపడే చర్యలు తీసుకోవడం ముఖ్యమని ఆయన అన్నారు. ఇప్పటికే సాగు చేసిన పంటలకు అవసరమైన నీటిని సకాలంలో అందించక పోతే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. అందుబాటు లో ఉన్న సాగునీటి వనరులను సమర్థంగా వినియోగించి, చెరువులను నింపి, ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని అధికారులను కోరారు. సాగునీటి సమస్యపై ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు నీటిపారుదల శాఖ అధికారికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని కోరారు.

## రత్నవరం గ్రామంలో దళిత సర్పంచ్‌కు అవమానం అంటూ ఆరోపణలు



కోదాడ / నడిగూడెం, అక్టోబర్ 22( సత్య నిష్ఠ): నడిగూడెం మండలం రత్నవరం గ్రామంలో దసరా పండుగ సందర్భంగా దళిత సర్పంచ్‌ను వేడుకల్లో పాల్గొనకుండా అడ్డుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. గ్రామ ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచ్‌కు పండుగల్లో పాల్గొనే హక్కు లేదా? పండుగలు అందరినీ కలిపే వేదికలు కావాలి కానీ, వివక్షకు వేదికలు కాకూడదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సంబంధిత అధికారులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, నిజానిజాలు నిగ్గు తేల్చి, తప్పు జరిగినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.రత్నవరం ఘటనపై వాట్సాప్ గ్రూపుల్లో చర్చ జరుగుతోంది.

## బృందావనాపురం రోడ్డులో రెండు బైకులు ఢీ

- మండల కేంద్రంలో అలుగు వద్ద బ్రిడ్జి నిర్మించలి
- నడిగూడెం నుండి మోత వరకు డబల్ రోడ్డును మంజూరు చేయాలి



కోదాడ - అక్టోబర్ 21 (సత్యనిష్ఠ) బృందావనపురం రోడ్డులో రెండు బైకులు ఢీకొన్న ప్రామాదంలో పలువురికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు, నిత్యం ప్రమాదాలతో ప్రజల్లో ఆందోళన.. డబుల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, బస్టాండ్ సమీపంలోని అలుగు వద్ద బ్రిడ్జి మంజూరు చేసి ఇక్కడ నుండి మోతే వరకు డబల్ రోడ్డు మంజూరు వెంటనే పనులు ప్రారంభించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇరుకు రోడ్లతో ప్రమాదాలు జరుగుతున్నందున వెంటనే నివారణకు అనుమతులు మంజూరు చేయాలనీ పలువురు డిమాండ్. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని నడిగూడెం--బృందావనపురం గ్రామాల మధ్య రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో గోపాలపురం, నడిగూడెం గ్రామాలకు చెందిన బైకర్లు గాయపడినట్లు సమాచారం. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. నడిగూడెం పరిసర ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటు ఉండడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై పెరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. ముఖ్యంగా కోదాడ నుంచి మోతె, జగన్నాథపురం వరకు రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించేందుకు అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని ఆ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రహదారి విస్తరణతో పాటు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత అధికారులు స్పందించి ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది

- విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరులకు ఘన నివాళులు
- బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్





హైదరాబాద్-అక్టోబర్ 21(సత్యనిష్ఠ): సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించే క్రమంలో విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి అమరులైన పోలీసుల త్యాగం వెలకట్టలేనిదని బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటున్న పోలీసుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు సమాజానికి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించేందు కు, సమాజంలో శాంతిభద్రతలు కొనసాగేం దుకు పోలీసులు చేస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని కోరారు. పోలీసు అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని, వారి సంక్షేమానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేశం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీ రుల సేవలను ఎన్నటికీ మరువలేమని, వారి త్యాగాలకు యావత్ సమాజం రుణపడి ఉంటుందని జాజుల లింగం గౌడ్ పేర్కొన్నారు.

## ఔరవాణి గ్రామంలో చెరువు, కాలువ వివాదం

### సర్పంచ్ పై ముప్పిడి మారయ్య ఆరోపణలు



నార్కట్పల్లి-అక్టోబర్ 21(సత్యనిష్ఠ): ఔరవాణి గ్రామంలో గత కొన్నేళ్లుగా నెలకొన్న చెరువు, కాలువ వివాదంపై మాజీ ప్రజా ప్రతినిధి ముప్పిడి మారయ్య స్పందించారు. గత 8 సంవత్సరాల క్రితం పై అధికారుల ఆదేశాల మేరకు చెరువు నింపే ప్రయత్నం చేయగా, కాలువను పూడ్చివేయడం, నీళ్ల రాకుండా అడ్డుపడటం వల్ల గ్రామానికి నేటికీ నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ఆరోపించారు. ఆ రోజు అడ్డుపడకుంటే గ్రామానికి ఇంత ఇబ్బంది ఉండేది కాదని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుతం డా. బి.ఆర్ అంబేద్కర్ కాలనీలో జాగా ఆక్రమణ విషయంలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని, తనకు సంబంధం లేని విషయంలో తన పేరును ప్రస్తావిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనపై వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.ఈ వివాదంపై గ్రామ ప్రజలందరి సమక్షంలో బహిరంగంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, గ్రామ పెద్దలు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని ముప్పిడి మారయ్య కోరారు.

## పుల్లారెడ్డి స్వీట్ హౌస్ అధినేత మృతికి మండలి చైర్మన్ గుత్తా నివాళి



నల్గొండ-అక్టోబర్ 21( సత్యనిష్ఠ): నల్గొండ పుల్లారెడ్డి స్వీట్ హౌస్ అధినేత బండ శ్రీనివాస్ రెడ్డి అకాల మరణం చెందారన్న విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేడు నల్గొండలోని వారి నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. శ్రీనివాస్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, బీరవల్లి గోపాల్ రెడ్డి, పాదూరి ఇంద్రసేనా రెడ్డి, యామ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమూలలో దుర్గామాత నిమజ్జనం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే బాలునాయక్



చందంపేట- అక్టోబర్ 21( సత్యనిష్ఠ): చందంపేట మండలం పెద్దమూల గ్రామంలో కొలువైన దుర్గామాత అమ్మవారి నిమజ్జన కార్యక్రమం సందర్భంగా దేవరకొండ శాసనసభ్యులు శ్రీ నేనావత్ బాలు నాయక్ గారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు తీసుకొని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన దుర్గామాత నిమజ్జన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారికి పూజలు నిర్వహించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మారుపాకుల సురేష్ గౌడ్, కిన్నెర హరికృష్ణ, కాకునూరి రంగయ్య గౌడ్, దుర్గామాత కమిటీ సభ్యులు, మేకల వెంకటయ్య, చేపూరి లక్ష్మయ్య, లింగాల నగేష్ గౌడ్, జయపాల్ రెడ్డి, వెంకటాచారి, నంది వెంకటయ్య, గ్రామ యువకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విజయానికి ప్రతీక శమ్మి పూజ

### రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి



నల్గొండ, అక్టోబర్ 21 (సత్య నిష్ఠ): నల్గొండ పట్టణంలోని నాగార్జున కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా శమ్మి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి విజయదశమి ప్రతీక అని అన్నారు. ఈ పర్వదినం ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, విజయాలు తీసుకురావాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 48వ వార్డు కార్పొరేటర్ యమ కవితా దయాకర్, కాలనీ అధ్యక్షుడు నాంపల్లి మనోహర్, పారేపల్లి శ్రీనివాస్, సోమిరెడ్డి, గుండా రాము, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.